# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 177 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 27 మే 2026 | పేజీలు : 3




ఎన్నికలకు ఓటర్ల జాబితా

## ముఖ్యం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

3

## రైతు గోస పట్టని

# రేవంత్ సర్కారు!

- బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి
- జనగామలో 'రైతు గోస.. బీజేపీ భరోసా' యాత్ర
- మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం సందర్శన

2





## ధాన్యం తరలింపు

# స్పీడప్ చేయాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం..
- రైతులకు జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ భరోసా

3






# రైతు గోస పట్టని ప్రభుత్వం!

- **బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి**
- **జనగామలో 'రైతు గోస.. బీజేపీ భరోసా' యాత్ర**
- **మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం సందర్శన**



**జనగామ, మన చౌరాస్తా :** రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోవడానికి నరకం చూస్తున్నారని.. తీవ్రమైన ఎండలకు కల్లా వద్ద రైతులు ప్రాణాలు కోల్పోతుంటే రాష్ట్రం పట్టించుకోవడం లేదని బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ 'రైతు గోస.. బీజేపీ భరోసా' బస్సు యాత్ర మంగళవారం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మహేశ్వర్ రెడ్డితో పాటు ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగే ష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, దన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ సీహెచ్ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్రెడ్డి, రాష్ట్ర స్పోక్స్ పర్సన్ ఆరుట్ల దశమంత్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌తో పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య, ఉదాసీన వైఖరి కారణంగా తెలంగాణ రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ముందస్తుగా ప్రణాళిక లేకపోవడంతో సరైన కొనుగోలు ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం మండిపడ్డారు. బీజేపీ పర్యటనను ప్రకటించిన తర్వాతే అకస్మాత్తుగా ఈ సమస్య తీవ్రతను గుర్తించి నిద్రలేచిందన్నారు. తాము కొనుగోలు కేంద్రానికి చేరుకోవడానికి ముందే.. హడావిడిగా ధాన్యాన్ని ఎత్తి లారీల్లో నింపి, అంతా సక్రమంగానే జరుగుతోందనే భ్రమ కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగైతే ప్రతి గ్రామంలో ఇక నుంచి బీజేపీ నాయకులు కొనుగోలు కేంద్రాల్లో కూర్చుంటారని తెలిపారు. రైతు కష్టాలు తీరే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్ రెడ్డి, లేగ రామ్మోహన్ రెడ్డి, ఉడుగుల రమేష్, బల్ల శ్రీనివాస్, బొజ్జపల్లి సుభాష్, పెరుమాళ్ళ వెంకటేష్, యుగేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తోకలు ఉమారాణి, అంజి రెడ్డి, భాగాల నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, లక్ష్మారెడ్డి, సుజన్, ముత్యాలు, కిసాన్ మోర్చన నాయకులు వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అనిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్దోజు జగదీష్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా భద్రతపై పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్, మన చౌరాస్తా :** హనుమకొండలో మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మరో ముందడుగు పడింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా భద్రతకు సంబంధించిన సందేశాలతో రూపొందించిన గోడ పత్రికను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.సమాజంలో మహిళలపై జరిగే వేధింపులు, నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన అవసరమని తెలిపారు. గోడ పత్రిక ద్వారా మహిళా హక్కులు, భద్రతా చర్యలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ వివరాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యం అన్నారు. పోలీస్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తే మహిళలకు మరింత భద్రత కల్పించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక బృందాలు, షీ టీమ్స్ సమర్థంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ దార కవిత, అదనపు డీసీపీ రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** మండలంలోని సిరిపురం గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని ఒక మహిళ మృతదేహం లభించినట్టు పోలీసులు తెలిపారు. సుమారు 60 నుండి 70 సంవత్సరాలు సన్నగా, నల్లని ఛాయ కలిగిన మహిళ ఆరెంజ్ కలర్ జాకెట్, పింక్ బోర్డర్ గల ముదురు రంగు చీరలో ఉన్నట్టు తెలిపారు. మృతదేహం వద్ద నాణేలు, ఒక ప్లాస్టిక్ సంచి లభించాయని, యాచకురాలిగా కనిపిస్తోందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విచారణ కొనసాగుతున్నదని పోలీసులు తెలిపారు. మృతురాలిని గుర్తించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. వివరాలు తెలిసిన లింగాలఘణపురం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని లేదా 8712685036, 8712685212 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

## బాల్యవివాహ రహిత తెలంగాణను రూపొందించాలి




లింగాలఘణపురం, మన చౌరాస్తా : లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన మహిళా సంక్షేమ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా బాల్యవివాహ రహిత తెలంగాణను రూపొందించాలని తహసీల్దార్ అండాలు, సర్పంచ్ నర్సింగ రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. సమాజానికి శాపంగా మారిన బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాలికల విద్యా, ఆరోగ్యం, రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, గ్రామాల్లో బాల్యవివాహాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ వాటిని అడ్డుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ సీతారాం నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, మిషన్ శక్తి విభాగం ప్రతినిధి హేమలత, ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, ఏఎన్ఎం సంపూర్ణ పాల్గొన్నారు. వీరితో పాటు ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు కొయ్యడ అనిల్ గౌడ్, వేల్పుల శోభారాణి, కత్తి శ్రీవాణి, నల్ల విల్సన్, వంగ సతీష్, బండారి మమత, కొమ్మరాజుల రేణుక తదితరులు పాల్గొన్నారు.

## సీకేఎం మార్గంలో ఆక్రమణల తొలగింపు



**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ నగరంలోని హెడ్ పోస్టాఫీస్ కూడలి నుంచి సీకేఎం ప్రసూతి ఆసుపత్రి వరకు ఫుట్ పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన పూల దుకాణాలను బల్దియా సిబ్బంది తొలగించారు. రోడ్డు ఆక్రమణల కారణంగా ఆసుపత్రికి వెళ్లే అంబులెన్సులు, గర్భిణీలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గతంలోనే విషయం తెలిసిందే. ఆలస్యంగా అయినా స్పందించి చర్యలు చేపట్టిన బల్దియా అధికారులను పలువురు అభినందిస్తున్నారు. అయితే ఇదే తరహాలో పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిపై కూడా ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రోడ్డుపై బండ్లు పార్కింగ్ చేయడం, మండిబజార్ పరిసరాల్లో కొన్ని హోటళ్ల ముందు రహదారినే ఆక్రమించడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

# ధాన్యం తరలింపు త్వరగా పూర్తి చేయాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం..
- రైతులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ భరోసా



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్)లో ఉన్న (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రం, ఘనపూర్ (స్టేషన్) మండలంలోని నమిలిగొండ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, అలాగే జఫర్గడ్ మండలంలోని కూనూరు గ్రామంలో గల పీఏసీఎస్ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎన్ని టోకెన్లు జారీ చేశారు? ఇప్పటి వరకు ఎన్ని లారీలు, ట్రాక్టర్లు ధాన్యం తరలించాయి? ఏ సమయంలో ఏ మిల్లుకు పంపించారు? ట్రక్ షీట్ లో వివరాలు సక్రమంగా నమోదు చేశారా? అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే ఇప్పటివరకు ఎన్ని ఓపీఎంఎస్ ఎంట్రీలు పూర్తి చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ జారీ నుంచి మిల్లులకు తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టోకెన్ పొందిన రైతుల సంఖ్య, ప్రతి టోకెన్‌కు అనుగుణంగా ఎన్ని లారీలు, ట్రాక్టర్లు పంపించారో స్పష్టమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు. ప్రతి మిల్లుకు ఏ సమయానికి వాహనాలు బయలుదేరాయో, ఇప్పటివరకు మొత్తం ఎన్ని లారీలు వెళ్లాయో, ట్రక్ షీట్ లో నమోదు చేసిన వివరాలు సరిపోలేలా చూడాలని తెలిపారు. కేంద్రాల్లో ప్రస్తుతం ఎన్ని కళ్లాల్లో ధాన్యం నిల్వలో ఉందో, ఎన్ని వాహనాల ఎంట్రీలు నమోదయ్యాయో కూడా నిరంతరం నవీకరణ చేయాలని ఆదేశించారు. ధాన్యం తేమ (Moisture) శాతాన్ని టోకెన్ వారీగా నమోదు చేసి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే ఐకేపీ నమిలిగొండ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, కేంద్రంలో ట్రక్కులు ఎప్పుడెప్పుడు బయలుదేరాయో, ఇప్పటివరకు ఎన్ని వాహనాలు వెళ్లాయో, ట్రక్ షీట్ లో నమోదైన వివరాలను పరిశీలించారు. ధాన్యం నిల్వలు, గన్ని సంచుల లభ్యత, కాంటా పూర్తయిన తర్వాత మిగిలి ఉన్న ధాన్యం బస్తాల వివరాలు, రిజిస్టర్ నిర్వహణ, తదితర అంశాలపై ఆరా తీశారు. కేంద్రంలో ప్రస్తుతం ఎంత మంది హమాలీలు పనిచేస్తున్నారో తెలుసుకుని అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేసి వెంటనే లోడింగ్, అన్లోడింగ్ పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ధాన్యం రవాణా ఆలస్యం కాకుండా ట్రక్కులు, డీసీఎంల ద్వారా వేగంగా తరలించాలని, లక్ష్యంగా నిర్ణయించిన రవాణా ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. అదే విధంగా ధాన్యంలో తేమ (Moisture) శాతం, టోకెన్ వారీగా ధాన్యం కొనుగోలు పరిస్థితి, కాంటా నిర్వహణ, ఓపీఎంఎస్ నమోదు, గన్ని సంచుల లభ్యత, రిజిస్టర్ నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. కాంటా వద్ద 41 కిలోల ప్రకారం తూకం వేయాలని సూచించారు. ధాన్యం నిల్వ కాకుండా కేంద్రాల నిర్వహణ సమర్థంగా ఉండాలని సూచించారు. పీఏసీఎస్ కూనూరు కేంద్రంలో డీసీఎంల ద్వారా ధాన్యం తరలింపు పరిస్థితిని పరిశీలించారు. ఈ క్రమంలో రెండు లారీలను తక్షణమే ఈ కేంద్రానికి పంపించాలని ఆర్టీఓకు సూచించారు. ఈ నేపథ్యంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతమైన చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు.




# ఘనంగా 108 పైలట్స్ డే

**నర్మెట, మన చౌరాస్తా :** 108 పైలట్స్ డే సందర్భంగా నర్మెట మండల కేంద్రంలో అత్యవసర సేవలు అందిస్తున్న 108 సిబ్బంది కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో 108 పైలట్ల సేవలు అమూల్యమని పలువురు కొనియాడారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సమయానికి స్పందిస్తూ సేవలు అందిస్తున్న పైలట్ల సేవా భావాన్ని అభినందించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నసీరుద్దీన్ మాట్లాడుతూ 108 సిబ్బంది ప్రజలకు అండగా నిలుస్తూ ప్రాణ రక్షకులుగా సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ ఈఎంటీ వనజ, రాజు, 108 పైలట్లు రాజేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు ఓటర్ల జాబితానే ముఖ్యం

- కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులపై ప్రత్యేక నిఘా అవసరం
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల(బిఎల్ఎ) అవగాహన సదస్సులో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య రూపొందించిన "బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్"ను ఆవిష్కరించి బిఎల్ఎ లకు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఓటరుతో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకుంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో బిఎల్ఎ లు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న మార్పులను గమనించాలని, రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి బిఎల్ఎ వద్ద తాజా ఓటర్ల జాబితా ఉండాలని, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, అనుమానాస్పద ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బిఎల్ఏ లు, బిఎల్ఓలతో కలిసి వచ్చే మూడు నెలలు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు అని పేర్కొన్నారు."మన ఓటును మనమే కాపాడుకోవాలని, ప్రతి బిఎల్ఏ ఒక సైనికుడిలా పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలి" అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఏ లు డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎమ్మార్వోలు తదితరులు పాల్గొన్నారు.



# భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెరగాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**జనగామ, మన చౌరాస్తా :** భూ భారతి దరఖాస్తులను పరిష్కరించే అంశంపై ప్రతి మంగళవారం జరిగే సమీక్ష సమావేశం సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ బెన్ షాలోం మంగళవారం అన్నీ మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి దరఖాస్తులను పరిష్కరించడంలో తహసీల్దార్లు, వారి సిబ్బంది విస్తృతంగా కృషి చేస్తున్నారన్నారు. అనంతరం అన్నీ మండలాల వారీగా ఉన్న పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ గోపీరాం, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలో జనగామ విద్యార్థులు

**జనగామ, మన చౌరాస్తా :** హనంకొండ అంబేద్కర్ భవనంలో నిర్వహించిన ప్రశాంత్ డ్యాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్ డ్యాన్స్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. అన్ని డిస్టిక్ స్టూడెంట్స్, డ్యాన్స్ మాస్టర్ పాల్గొన్నారు. మాస్టర్ అబ్బాస్ మాట్లాడుతూ డ్యాన్స్ కాంపిటీషన్లో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు మరియు సర్టిఫికెట్స్ అందజేశారు సెలెక్ట్ అయిన విద్యార్థులకు నేషనల్ లెవెల్ త్వరలో డేట్ తెలియజేస్తానని చెప్పారు. అలాగే జనగామ జిల్లా సీనియర్ డ్యాన్స్ గ్రాండ్ మాస్టర్ గౌస్ పాషా, మాస్టర్స్ అబ్బాస్, బోట్ల హరీష్, గంపల సాయిని ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ సినీ డ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జానీ మాస్టర్ వైఫ్ సుమలత, సినీ కొరగ్రాఫర్ రమేష్ మాస్టర్, సినీ డైరెక్టర్లు, సినీ కొరియోగ్రాఫర్ ప్రశాంత్, చరణ్ మాస్టర్, ఉమ్మడి వరంగల్ డిస్ట్రిక్ట్ డాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సెక్రటరీ ట్రెజరర్ మరియు టైక్వాండో బ్లాక్ బెల్ట్ స్టూడెంట్స్ రుద్ర, అనూష తదితరులు పాల్గొని సీనియర్ మాస్టర్లకి వాళ్ల కుటుంబ సభ్యులకి ఘనంగా సన్మానించారు.

# బక్రీద్ బందోబస్తుపై వరంగల్ సీపీ సమీక్ష

**వరంగల్, మన చౌరాస్తా :** కమిషనరేట్ పరిధిలో బక్రీద్ పండుగకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన సమీక్షించారు.ప్రార్థనా స్థలాల వద్ద విజిబుల్ పోలీసింగ్ ఉండాలని, గోవుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన చెకోపోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు చెక్ పోస్టుల ద్వారా 11 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్టేషన్ స్థాయిలో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, పాత నేరస్తులను బైండోవర్ చేయాలని సూచించారు. గ్రామీణ సంతల్లో పశువుల విక్రయాల పై నిఘా పెట్టాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారి పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వధ శాలల వ్యర్థాల తరలింపునకు మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీపీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.